క్లుప్తంగా

'బీజేపీ ప్రోద్బలంతోనే ఈడీ దాడులు'

ఖమ్మంరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రోద్బలంతోనే రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసం, వ్యాపార సంస్థలపై ఈడీ దాడులు చేస్తోందని యువజన కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా సురేష్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ప్రజాపాలన అందజేస్తున్న మంత్రులే లక్ష్యంగా కేంద్రం ఆధీనంలోని దర్యాప్తు సంస్థలు ఈ విధంగా దాడులు చేసి ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసే కుట్రకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తెరలేపాయని విమర్శించారు.

నేలకొండపల్లి: బీజేపీ దాడులతో భయపెట్టాలని చూస్తుందని కాంగ్రెస్ నాయకులు మారగాని అంజయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడిని బీజేపీ కుట్ర పూరితంగా ఈడీ దాడులు చేయిస్తుందన్నారు. ప్రజానాయకుడు, నిరుపేదలకు అండగా ఉంటున్నందున్న కేంద్రం తట్టుకోలేకపోతుందన్నారు. ప్రజలను తప్పదోవ పట్టించేందుకు కక్షపూరితంగా బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డిపై ఈడీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కడియాల నరేష్, తెలగమళ్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి వితరణ



నగదు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: గుజరాత్ వడోదర పరూల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి చలువాది వెంకట లోకేష్ చదువుల నిమితం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ పాలక వర్గం రూ. 43 వేల నగదును అందించింది. నగరంలోని గుట్టల బజార్‌లో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం ఈ నగదును ఆలయ చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు దంపతుల చేతుల మీదుగా విద్యార్థి తల్లి చలువాది ప్రశాంతి, కుటుంబ సభ్యులకు అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

కామేపల్లి: అతివృష్టి కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కామేపల్లిలో మాట్లాడారు.. ఇటీవల కురిసిన వర్షానికి రైతులు సాగు చేసిన పత్తి, మిరప పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని కోరారు.

సామాజిక సేవ అలవర్చుకోవాలి

కామేపల్లి: ప్రతి ఒక్కరూ సామాజిక సేవ కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహించడం అలవర్చుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని హరిశ్చంద్రాపురంలో ఛార్డ్ సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ 30 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలను వివరించి, భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందించేందుకు సంస్థ కృషి చేయాలని కోరారు. గోంగుర వెంకటేశ్వర్లు, కృష్ణారావు, నరసింహారావు, చిన్నప్ప, శంకర్, నవీన్, సంస్థ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	దేవర
సాయిరాం	దేవర
ఆదిత్య	దేవర, మత్తు వదలరా 2
శ్రీనివాస	దేవర, సత్యం సుందరం

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	50	బచ్చలికూర	3
వంకాయ	36		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	46	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	44	తోటకూర	3
దొండ	42		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	60		20
గోరుచిక్కుడు	44	మెంతికూర	2
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	36		50
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	54		25
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

9 రోజులు.. అవతారాలు

శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి విగ్రహాలు సిద్ధమయ్యాయి. కళాకారుల నైపుణ్యంతో తయారు చేసిన అమ్మవారి ప్రతిమలు కనువిందు చేస్తుండగా.. అమ్మవారు 9 రోజుల పాటు 9 అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దసరా పండగ సందర్భంగా వచ్చే నెల 3వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యాన మార్కెట్‌లో అమ్మవారి విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి.



రాజస్తానీల ఖార్ఖానాలో విక్రయానికి సిద్ధంగా ఉన్న అమ్మవారి విగ్రహాలు

కనువిందు చేస్తున్న అమ్మవారి విగ్రహాలు

- నవరాత్రోత్సవాలకు ప్రతిమలు సిద్ధం
- ఉట్టిపడుతున్న రాజస్తానీ కళాకారుల నైపుణ్యం
- విగ్రహాల తయారీ, విక్రయాలతో పలువురికి ఉపాధి
- సైజు, ఆకృతిని బట్టి ధరలు

ఖమ్మంగాంధీచౌక్: దసరా పండుగను పురస్కరించుకుని అమ్మవారికి శరన్నవరాత్రులు పూజల చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఈనేపథ్యాన ఖమ్మం నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకొచ్చి రహదారుల వెంట విక్రయిస్తుండగా.. కొనుగోళ్లతో సందడి నెలకొంది. కాగా, దశాబ్దాలుగా రాజస్థానీలు ఖమ్మంలో ఖార్ఖానాలు ఏర్పాటు చేసుకొని గణపతి, అమ్మవారి ప్రతిమలను తయారు చేసి విక్రయిస్తుండగా.. మూడేళ్లుగా స్థానికులు, వరంగల్, కోరుట్ల తదితర ప్రాంతాలకు చెందిన వారు మహారాష్ట్ర, విజయవాడ, వరంగల్, కరీంగనర్ తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారీ..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కొబ్బరి పీచు, వెదురు బొంగులతో అచ్చుల ద్వారా బొమ్మలను తయారు చేస్తున్నారు. ఆయా బొమ్మలను కళాకారులు తమ నైపుణ్యంతో రంగులద్దుతూ ఆకృతిని తీర్చిదిద్ది విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. అలంకరణ, త్రిశూలం, కత్తులు, హారాలను తీర్చిదిద్దడం వంటి పనులు నైపుణ్యంతో చేయాల్సి ఉంటుంది.



విగ్రహాన్ని కొనుగోలు చేస్తున్న భక్తులు

రాజస్థానీలకు ఉపాధి..

కళను నమ్ముకొని వచ్చిన రాజస్తానీ కళాకారులు ఇంటిల్లిపాది ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో దాదాపు 200 రాజస్తానీ కుటుంబాలు ఉండగా.. నగరంలోని 8 ప్రాంతాల్లో డేరాలు వేసుకొని, మధ్యవర్తుల సాయంతో కమీషన్ ఇస్తూ విగ్రహాలను విక్రయిస్తున్నారు. నిద్ర లేచింది మొదలు ఇదే పనిలో నిమగ్నం కాగా కొందరు విగ్రహాల తయారీ ఖార్ఖానాలను నిర్వహిస్తుండగా, మరికొందరు కార్మికులుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

పండగల ఆధారంగా..

రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కళాకారులు ఈ విగ్రహాల తయారీలో నిష్ణాతులు. ఈ కళాకారులు పండగల ఆధారంగా వినాయకుడు, అమ్మవారు, రాముడు, కృష్ణుడు, రాధాకృష్ణుడు తదితర విగ్రహాలను తయారు చేస్తూ కుటుంబాలతో ఇక్కడ నివాసముంటూ జీవనం సాగిస్తున్నారు. విగ్రహానికి ఉన్న డిమాండ్ ఆధారంగా



రంగులద్దుతున్న రాజస్తానీ కళాకారుడు

విగ్రహం సైజు, ఆకృతిని బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. అడుగున్నర నుంచి 12 అడుగుల సైజు వరకు విగ్రహాలు అందుబాటులో ఉండగా.. సైజును బట్టి రూ.5 వేలు మొదలు రూ.45 వేల వరకు విక్రయిస్తున్నారు.

కుటుంబం అంతా ఇదే పని..



నాన్న, తమ్ముళ్లు, నేను కుటుంబం అంతా ఇదే పని. నాన్న గత 25 ఏళ్ల క్రితం రాజస్తాన్ నుంచి ఖమ్మం వచ్చారు. ఇప్పుడు ఎవరికి వారే ప్రత్యేక ఖార్ఖానాలను ఏర్పాటు చేసుకొని బొమ్మలు తయారు చేసి విక్రయిస్తున్నాం. ప్రస్తుతం స్థానికులు విగ్రహాలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి విక్రయించడంతో పోటీ పెరిగింది.

– గులాబ్ చందు, రాజస్తాన్

విగ్రహాలు బాగున్నాయి..



అమ్మవారి విగ్రహాలు ఆకర్షనీయంగా ఉన్నాయి. అనేక ఏళ్లుగా గ్రామంలోని శివాలయంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. కమిటీ బడ్జెట్‌లో అమ్మవారి విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు ఖమ్మం వచ్చాం. ఇప్పటికే చాలా విగ్రహాలు బుక్ అయ్యాయి.

– వీరవనేని అప్పారావు, రావినూతల, బోనకల్ మండలం

వయో వృద్ధుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్, జిల్లా శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం టీటీడీసీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించే ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ కోరారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వృద్ధులకు వారి సమస్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాశరావు, అనాశి రాధాకృష్ణ, నరసయ్య, జనార్దన్‌రావు, జిల్లా వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, రాధాకృష్ణ, గోవర్ధన్‌రావు, రుద్రభిక్షం, నాగేశ్వరరావు, దర్గయ్య, రచ్చ రామారావు, ఉపేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న గ్రామీణ వైద్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టి ఖమ్మం వచ్చిన సీయాసత్ దినపత్రిక ఎడిటర్ అమీర్ అలీఖాన్‌కు మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాలులో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్ఎంపీలకు, పీఎంపీలకు గుర్తింపు ఇవ్వాలని, అదేవిధంగా మెడికల్ కౌన్సిలింగ్ దాడులు నిలిపివేయాలని, తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ నజీరుద్దీన్, గౌరవాధ్యక్షుడు షేక్ హాసన్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.హాసన్, ప్రధాన కార్యదర్శి జానీమియా, కోశాధికారి బాబుసాహెబ్, ఉపాధ్యక్షుడు ఖాసీం కోరారు. వినతి అందించిన వారిలో సహాయకార్యదర్శి షేక్ ఆశా, ఎండి. సాహెబ్, అమీర్, జానీ, షేక్ అబ్దుల్, మస్తాన్ పాషా, మన్సూర్‌అలీ, షాజహన్, నబీ, అలీ, అహ్మద్ పాషా, వలీ, మహిమూద్, బాజీ, రబ్బానీ, ఇస్మాక్ పాషా పాల్గొన్నారు.

వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో..

వీరనారీ మణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అలీఖాన్‌ను టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాలులో ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్రబాయి, ప్రధాన కార్యదర్శి మామిడాల ఝాన్సీ, ఉపాధ్యక్షురాలు జ్యోతి, నాయకులు బాణోతు భద్రూనాయక్, డాక్టర్ కేవీ.కృష్ణారావు పాల్గొన్నారు.

మైనార్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మైనార్టీ డిక్లరేషన్ అమలు చేయాలని ఎమ్మెల్సీ ఆమేర్ అలీఖాన్‌కు తెలంగాణ ముస్లీం ఆర్గనైజేషన్ జేఏసీ జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ రెహమాన్ ఖమ్మం ఎస్‌పీ గెస్ట్ హౌస్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ సలీంపాషా, షేక్ యాఖుబ్‌భాయి ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సుధాకర్

నేలకొండపల్లి: బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని సుర్దేపల్లిలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ కార్యకర్త సభ్యత్వ నమోదులో సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ కర్నలపూడి విజయ్‌కుమార్, సతీష్, కె.గోపి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

నేలకొండపల్లి: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి మృతిపై మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు నివాళులర్పించారు. ఆదివారం హైద్రాబాద్ లోని మంత్రి నివాసంలో పురుషోత్తమ్‌రెడ్డి భౌతికకాయంను సందర్శించి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

రఘునాథపాలెం: ఖమ్మం నగరానికి చెందిన కె.విజయలక్ష్మిపై మండలంలోని పాపటపల్లికి చెందిన బి.లక్ష్మీనారాయణ, శైలజ, వెంకటేశ్వర్లు, నాగమణి దాడి చేశారు. బాధితరాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. ఈ నెల 16న బాధితురాలు ప్లాటుకు సంబంధించిన విషయంలో తన డబ్బులు ఇవ్వాలని లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో నలుగురు కలిసి దాడి చేశారు. ఆస్పత్రిలో వైద్యం పొందిన అనంతరం బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



ఫోన్ అందజేస్తున్న సీఐ భానుప్రకాష్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంఅర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న నాలుగు ఫోన్లను ఆదివారం బాధితులకు అందజేశారు. ప్రత్యేక యాప్ ద్వారా గుర్తించి రికవరీ చేసిన ఫోన్లును సీఐ భానుప్రకాష్, ఎస్సై వరాల శ్రీనివాస్ బాధితులకు అందించారు.

రుణమాఫీ అమలు చేయాలి

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం మండల నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ.రెండు లక్షలకు పైగా ఉన్న రైతులు మిగిలిన నగదు కట్టాలని ప్రభుత్వం తెలపడంతో కొందరు రైతులు అప్పులు చేసి బ్యాంకుల్లో కట్టారని, ప్రభుత్వం ఇంతవరకు రూ.2లక్షల బ్యాంకుల్లో జమ చేయకుండా ఆలస్యం చేస్తుందన్నారు.

ముస్తాబవుతున్న శ్రీ ధర్మశాస్తా ఆలయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో కోట్లాది రూపాయలతో నిర్మించిన శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ముస్తాబు పనులు చేస్తున్నారు. అక్టోబర్ 6న ధ్వజస్తంభం నిలబెట్టుట, అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠకు ముహుర్తం నిర్ణయించినట్లు శ్రీ ధర్మశాస్తా అన్నదాన సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ మేకల హనుమంతరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ధ్వజస్తంభం నిలబెట్టు కార్యాక్రమం, 9.12 గంటల నుంచి మధ్య పంచలోహ విగ్రహ పోత ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిపారు. అయ్యప్పస్వామి విగ్రహ పోత సమయంలో భక్తులు బంగారం, వెండి, సమర్పించాలని కోరారు



శ్రీ ధర్మశాస్తా ఆలయం

కొత్త షోలకు వేదికగా ఖమ్మం

- మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: పెద్ద పెద్ద మహానగరాలకే పరిమితమైన లేజర్ షో వంటి ప్రదర్శనలు ఇప్పుడు ఖమ్మం నగరానికి వచ్చాయని, ఇది నగర ప్రజలు తిలకించేందుకు చక్కని అవకాశమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని పెవిలియన్ మైదానంలో ఏర్పాటు చేసిన స్తంభాద్రి లేజర్ షో కం ఎగ్జిబిషన్‌ను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో పలు స్టాళ్లను ప్రారంభించిన మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నగరంగా ఖమ్మం ఉందన్నారు. ఇక్కడ నివసించే ప్రజలకు కొత్తదనం అందించడంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు ముందుంటున్నారన్నారు. కొత్తదనం పంచేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ... ఈ ఎగ్జిబిషన్ 45 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఎగ్జిబిషన్‌లో లేజర్ షోతోపాటు 80 అడుగుల జెయింట్‌వీల్, మేరి కొలంబస్, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రైన్, క్రాస్ వింగ్, చిన్నారుల కోసం పలు స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, బుడిగం శ్రీను, నాయకులు వెంకటరమణ, ఎగ్జిబిషన్ నిర్వాహకులు తుమ్మ అప్పిరెడ్డి, బాలశౌరి, వాసు, అచ్చయ్య పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

గోల్డెన్‌జూబ్లీ మీటింగ్‌కు తరలిరండి



మాట్లాడుతున్న మనోహర్‌రాజు

ఖమ్మంమయూరిసెంటర్: పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకల సందర్భంగా హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గోల్డెన్ జూబ్లీ మీటింగ్‌కు జిల్లాలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని సంఘం పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సంఘం శాస్త్రీయ విద్యాసాధన, సమ సమాజ స్థాపన, విద్యార్థుల హక్కులు, అన్ని వర్గాల ప్రజల సౌకర్యాలకు అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో అనేక మత ఘర్షణలు పాలకులే ప్రోత్సహిస్తున్న స్థితి అని అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ప్రజల మధ్య అనేక రకాల ఉద్రిక్తలు నెలకొల్పుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. వి.మనోహర్‌రాజు, జి.రామయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ, శ్రీను, లక్ష్మి, సురేష్, వెంకటకృష్ణ, సునీల్, వెంకటేష్, యశోద పాల్గొన్నారు.

మతోన్మాదం నుంచి ప్రజలను కాపాడాలి

నేలకొండపల్లి: మతోన్మాదం నుంచి ప్రజలను కాపాడాలని న్యాయవాది తిరుమలరావు అన్నారు. పీడీఎస్‌యూ 50 ఏళ్ల సందర్భంగా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...దేశంలో ప్రస్తుతం మతోన్మాదం రోజు రోజు కు పెరుగుతుందని, కుల, మతాల పేరుతో దాడులకు హత్యలకు ఆత్యాచారాలకు గురవుతున్నారన్నారు. ఈ నెల 30 న హైద్రాబాద్‌లో జరిగే 50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోగినేని సీతారామారావు, కె.రవీందర్, శివరాం, మారగాని నాగయ్య, సీ.వై.పుల్లయ్య, పగిడికత్తుల రామదాసు, పి.నాగేశ్వరరావు, చిర్రా రవి, పెద్దపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీ పాలెంను మండలకేంద్రంగా ప్రకటించాలి

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలంలో భాగమైన ఎం వెంకటాయపాలెంను నూతన మండలంగా ప్రకటించాలని అఖిల పక్షం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎంవీ పాలెంలో అఖిలపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. ఈ సందర్భంగా నాయకులు గుర్రం అచ్చయ్య, నంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మండలంలోని 12 గ్రామాలను కలిపి ఏదులాపురం కేంద్రంగా కొత్త మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని భావించడం అభినందనీయమన్నారు. అయితే మిగిలిన గ్రామాలను కలిపి అన్ని పంచాయతీలకు కేంద్ర బిందువుగా ఉన్న ఎంవీపాలెంను ఏమాత్రం జాప్యం చేయకుండా నూతన మండలాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు దొండేటి సత్యం, కుర్రా. వెంకన్న, గంగవరపు. రత్నాకర్‌రావు, నాగమణి, బి.రాయుడు, ఆర్.నాగేశ్వరరావు, కె.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్చయ్య

వరద బాధితులకు చేయూత



కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మున్నేరు వరద బాధితులకు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఏర్పాటు చేసిన సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఈ కిట్లను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల చంద్రశేఖర్, కూచుపుడి శ్రీనివాసరావు, సూకారపు కోటేశ్వరరావు, హనుమంత్, జగన్, సీపీఐ నాయకులు బోడా వీరన్న తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం: వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా వాసులకు హైదరాబాద్ టెక్ మహింద్రా ఉద్యోగులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఉద్యోగులు సూర్యా, హరికృష్ణ, వేదవ్యాస్, శ్రీకాంత్, థామస్ పాల్గొన్నారు.

కలిసిరాని ఖరీఫ్..!





ఎర్రబారిన పత్తి చేను (ఇన్‌సెట్) వర్షానికి నల్లబడిన పత్తి కాయలు

వరుస వర్షాలకు అన్నదాతల బెంబేలు

- దెబ్బతిన్న పత్తి, మిర్చి పంటలు
- పంట దిగుబడిపై ఆవిరైన ఆశలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కామేపల్లి: అన్నదాతలు కోటి ఆశలతో ఖరీఫ్ సాగు పనులు చేపట్టగా.. వరుస వర్షాలతో పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ పంటలు సాగు చేసిన నాటి నుంచి వాతావరణం అనుకూలించకపోవడంతో అన్నదాతలు ఖరీఫ్ సాగుపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. అధిక వర్షాల కారణంగా పత్తి పూతకాత సరిగా రాలేదు. దీనికి తోడు కాయలు నల్లబడి పంట దెబ్బతింది.

11 వేల ఎకరాల్లో పత్తి సాగు..

కామేపల్లి మండలంలో సుమారుగా 11 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మరో కొద్ది రోజుల్లో పత్తి పంటకు గులాబీ రంగు పురుగు వ్యాపించే అవకాశం ఉండడంతో ఈ ఏడాది పత్తి పంట దిగుబడిపై ఆశలు వదులుకున్నారు. పత్తికి పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మిరప మొక్కలు సైతం వర్షం కారణంగా వేరు తెగుళ్ల సోకి వేసిన మిరప మొక్కలు పూర్తిగా దెబ్బతినడంతో తోటను దున్ని మళ్లీ మిరప సాగు చేపట్టారు. దీంతో అనుకున్న దానికంటే పెట్టుబడి రెండింతలు పెరిగింది. ఏదిఏమైనా ఈ ఏడాది ఖరీఫ్ సాగు అన్నదాతలకు కలిసి రాలేదని చెప్పొచ్చు. వరుస వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నారు.